


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *పసిపాపలకి ఏమిష్టం?*

**ఆ రోజుల్లో** మాకు చంటి పిల్లలతో వచ్చే పోయే చుట్టాలతో, పనిమనుషులు దొరికీ దొరకక, ఓ వేళ దొరికినా వారానికి రెండురోజులు చెప్పకుండా పెట్టే నాగాలతో బతుకు మట్టిరోడ్డుమీద జట్కా బండిలా ఉండేది. ఇప్పటిలా నల్లేరు మీద బండిలా మళ్ళీ మాట్లాడితే తారు రోడ్డు మీద బెంజికారులా రయ్యిన దూసుకు పోయేది కాదు.

మొగుడూ పెళ్ళాం, పిల్లాడితో పర్వం మొదలు పెట్టాక గానీ పోగొట్టుకున్న సరదాలు అర్థమయ్యేవి కావు. రాత్రంతా ఆడి, తెల్లవారుఝామున పడుకునే దుండగీడు ఒకడైతే, మంచి నిద్రలో వుండగా, తెల్లవారుఝామున ఏ మూడింటికో తాన్‌సేన్, క్షేత్రయ్య పదం పాడుతున్నట్లు ఆరున్నొక్కరాగం ఆలపించే అల్లరి పిడుగు ఇంకోడుంటాడు. తెల్లవారితే 'ఏవండీ'కి ఆఫీస్ కాబట్టి, ఎర్రని చింతనిప్పుల్లాంటి కళ్ళతో, కడుపున పుట్టి ఏడిపిస్తున్న వాడిపిర్రమీద గట్టిగా ఒక్కటుచ్చుకో లేక ఎత్తుకుని తిప్పే ఓపిక లేక, పాలు ఇచ్చి శాంత పరుద్దామని చూస్తే, ఒకంతట వాడు తాగక 'ఇందాక ఎందుకు ఇవ్వలేదూ? ఇందాకా అయితేనే తాగుతా.. ఇప్పుడొద్దు' అన్నట్లు కళ్ళు కూడా తెరవకుండా, లేత గుప్పెళ్ళు బిగించి ఏడుస్తుంటే ఆ లేత తల్లి అగచాట్లు చూడాలి. కొందరు ఇంటివాళ్ళు మంచివాళ్ళుంటారు కానీ మా సీతాదేవిగారులాంటి వాళ్ళైతే "పిల్లలున్నవాళ్ళకి అద్దెలకివ్వద్దు అని మా వారు చెపితే వినరు" అని రుసరుసలాడ్తారు.

అసలు ఈ కొత్త అమ్మానాన్నల అవస్థలు చూడాలంటే సినిమా హాలులోనే చూడాలి.

అప్పటిదాకా పాలపీక నోట్లో పెట్టుకుని ఆడుతున్న సత్రకాయ, సినిమా తెరమీద అమ్మకి ఇష్టమైన శోభన్‌బాబో, నాన్నకిష్టమైన శ్రీదేవో రాగానే భీంపలాస్‌లో కళ్యాణిరాగం కలవక పోయినా బలవంతంగా విరిగిన పాలతో కాఫీ కలిపినట్లు కలిపి రాగం ప్రారంభిస్తాడు. అక్కడ శ్రీదేవీ, శోభన్‌బాబుల చిందులు, ఇక్కడ వీడి రాగాలు. పక్కవాళ్ళూ, వెనుక వాళ్ళూ మొదట మొహం చిట్లించీ, ఆ తర్వాత తమ అసహనాన్ని మాటల రూపంలో 'అసలు చిన్నపిల్లలతో సినిమా ఎందుకమ్మా?' అనీ, మా లక్ష్మణరావు లాంటి వాళ్ళు "పిల్లాడికి పాలివ్వమ్మా" అనో, తమ భావ స్వేచ్ఛని ప్రకటిస్తారు. లేత తల్లి అక్కడికీ చీకట్లో పాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది. ప్రహ్లాదుడిలా తండ్రిని సాధించబూని, బుజ్జిగాడు శృతి పెంచి శుద్ధ హిందోళాన్ని ఏ రిషభంతోనో జతకలిపి శంకరశాస్త్రిలకి శంకరాభరణంలోలాగా కోపం తెప్పిద్దామా అని టాప్ లేచిపోయేట్లు ఏడుపు ప్రారంభించాక, ఇక 'హిరణ్యకశిపుడు'గారు 'వీడు నా కడుపున పుట్టిందే, శ్రీదేవికీ నాకూ అడ్డం పడడానికి' అని వాడ్ని భుజాన వేసుకుని లేచి తలుపు వైపు నడక సాగిస్తాడు.

సీట్లో కూర్చుని సినిమా చూసే ఇల్లాలికి భర్త అలా సినిమా వదిలి పెట్టి వెళ్ళగానే పాతివ్రత్యపు గిల్టీ ఫీలింగ్ పెనుభూతమై పీడిస్తుంది.

"ఇదిగో.. ఇలా రండి.. నేను ఎత్తుకుంటా.. మీరు కూర్చోండి" అని సైగలతో, పిలుపులతో కాసేపు చుట్టుపక్కల వాళ్ళని మళ్ళీ శిక్షిస్తుంది. ఆ తర్వాత తెరమీద అంజలీదేవి భోరుమని ఏడుస్తుంటే మళ్ళీ పిల్లాడి ఏడుపు గుర్తొచ్చి దిక్కుమాలిన సినిమా హాల్లో ఏ నల్లి అయినా కుట్టిందేమో నా బుజ్జి కన్నకి లేకపోతే 'వెల్ బిహేవ్డ్ కిడ్' అలా ఏడవడు అనుకుని లేచి వెళ్ళి పిల్లాడ్ని తీసుకుని "మీరు వెళ్ళండి అంటుంది. ఈలోగా సినిమాని మలుపు తిరిగే సంఘటన జరిగిపోయి, భర్తగారొచ్చేసరికి శ్రీదేవి మంగళసూత్రం పట్టుకుని నా భర్తని కాపాడు మంగళగౌరీ" అని ఏడుస్తుంటుంది. ఏం జరిగిందో, ఇందాక చిలోపాలోమని గెంతులేసిన అందమైన కాలేజీ అమ్మాయికి, నిండుగా మేకప్ వేసిన బుగ్గలమీద జారిపడే కన్నీళ్ళు , పెట్టుడు 'ఐలాషెస్' నుండి నల్లగా కారుతుంటే, 'ఛ ఇందుకా ఇన్ని అవస్థలుపడి టికెట్టు సంపాదించినదీ అనుకుంటాడు ఆ భర్త. గుమ్మం బయట పిల్లాడ్ని భుజాన వేసుకుని నిలబడ్డ పతివ్రతా శిరోమణి తల్లి, పిల్లాడు కొంచెం ఊరుకునేసరికి, గుమ్మంలోంచి మొదట తల కాస్త లోపలికి పెట్టి, కర్టెన్ జరిపి, పిల్లాడికి తెలియకుండా సినిమా చూస్తుంటుంది. శోభన్ బాబు బూట్లు తప్ప కనపడ్డం లేదు ఫైటింగ్ సీన్లో అని తెర పూర్తిగా తొలగించి హాల్లోకి అడుగుపెట్టగానే 'గర్భవిరోధి' మార్క్ బుజ్జిగాడు 'కెవ్వున' మళ్ళీ రోట్లో పచ్చిమిరపకాయలు నూరుతుండగా, కంట్లో పడినట్లు ఏడుపు లంకించుకుంటాడు. అంతా తెరమీద నుండి దృష్టి ఆ లేత తల్లివైపు పెట్టి "సినిమా చూడకపోతే ప్రాణాలు పోతాయా?" లాంటి కామెంట్స్ చేస్తారు.

ఆ తల్లికీ, తండ్రికి చాలా అవమానాలు జరిగిపోయి, వారు నలుగురిలో, సమాజంలో తప్పు చేసి దొరికిపోయిన వారిలా తలలు వంచుకుని థియేటర్ నుండి నిష్క్రమించాక బుజ్జిగాడు తల్లి చెవి రింగుతో ఆడూ 'బూ..బా...ఆ..గాగా గీగూ" అని ఆమె బుగ్గలమీద ముద్దులు కురిపిస్తూ తెగ ఆడ్తాడు. ఆ పిచ్చి తల్లి జరిగిన అవమానం మర్చిపోయి తనకేదో ఘన సన్మానం జరిగినట్లు భర్తతో "చూసారా చిన్నినాన్న ఎలా నవ్వుతున్నాడో.. దిక్కుమాలిన థియేటర్లో అంతంత శబ్దాలు పెడ్తే భయపడ్డాడు" అంటుంది. తండ్రికూడా ఎత్తుకుని వాడిని ముద్దులు పెట్టుకుని శ్రీదేవి మేకప్ చెక్కిళ్ళు మర్చిపోతాడు.

"ఇంకెప్పుడూ వెళ్ళొద్దులే కన్నా" అంటాడు. పుత్ర గాఢ పరిష్వంగపు సుఖంతో ఏదీ సరితూగదు మరి.

ఇవన్నీ హోం థియేటర్లూ, కరోనాలూ లేని టైంలో 'రోనా'ల గురించి. అసలు పిల్లలు ఎందుకు ఏడుస్తారూ? అనేది ఏ శాస్త్రవేత్త పరిశోధనకీ అందని విషయం. వాడికి 'అమ్మకావాలి' అనిపిస్తే ఏడుస్తాడు. వాడికి 'బొమ్మకావాలి' అనిపిస్తే ఏడుస్తాడు. 'ఆకలేసినా' ఏడుస్తాడు, నిద్రొచ్చినా ఏడుస్తాడు. బోర్ కొట్టినా ఏడుస్తాడు, కాసేపు ఏడవాలి అనిపించినా ఏడుస్తాడు. ఒక్కోసారి ఇంటికి ఇష్టంలేని వాళ్ళొచ్చినా ఏడుస్తాడు. 'అంతా నా ఇష్టం. నా ఏడుపేదో నన్ను ఏడవనీయండి' అనే టైప్. పెద్దవాళ్ళు అందుకే 'బాలానాం రోదనం బలం' అని సింపుల్‌గా తేల్చేస్తారు. అదే వాడికి లేదా దానికీ బలం ఏడవనిద్దురూ అని. అంతే కానీ గూగుల్ సెర్చ్ చేసి, టాడ్లర్స్ అనే బుక్ రిఫర్ చేసి కంగారు పడిపోయేవారు కాదు.

రేడియోలో రెండు స్టేషన్లు కలిసిపోయి, గుత్తి వంకాయ కూరా, యోగాసనాలూ వింటూ బూర్లెమూకుడులో ఒంటికాలిమీద నిలబడినట్లు, ఆ ప్రసారం వింటూ వంట నేర్చుకునే ప్రహసనంలో... కొత్తగా తల్లైన ఈ తల్లి అటు తన అమ్మమ్మ చెప్పినదీ, ఈ పిల్లల పెంపకం బుక్‌లో రాసిందీ బుర్రలో కలిసిపోయి, తేనెలో కరక్కాయ రంగరించి, మొగుడికి పట్టిస్తుంది.

"ఇదేవిటే?" అంటే "ఏమో హనీ బుక్‌లో అలా వుంది. పిల్లాడు ఏడిస్తే హబ్బీకివ్వాలనీ, ఏం ఇవ్వాలో తెలియలేదు. అమ్మమ్మ కరక్కాయ తేనెలో రంగరించి ఇమ్మంది నిన్న" అంటుంది అమాయకంగా.

ఈ చంటి పాపలు దేవుడి ప్రతిరూపాలనీ, అమాయకపు పసిపాపలనీ పాటలు పాడ్తామేకానీ, కొద్దిగా శాడిజంతో, తల్లి పనంతా చేసి, ఆకలిగా అన్నం ముద్ద కలిపి నోట్లో పెట్టుకునే సమయానికి బయటకి పోవడం, వెంటనే తల్లి లేచి వాడిని శుభ్రం చెయ్యడం,


లంగోటా మార్చడం జరిగేది. ఇంక ఏడుపంటారా అది తల్లి అన్నం తిన్నా, నిద్రపోతున్నా ఇష్టమైన సినిమా చూస్తున్నా తండ్రితో ముచ్చట్లాడుతున్నా, తన అనంగీకార తీవ్ర అసంతృప్తిని బిగ్గరగా గొంతు పెంచి, దిక్కులు పిక్కటిల్లేట్లు ప్రకటించడం పరిపాటే. అప్పుడు ఇలా 'డయిపర్' మూటలు కట్టి, పిల్లవాడు ఏం చేసినా, పైకి కనిపించనంతవరకూ పట్టించుకోకుండా తిరిగే రోజులు కావుగా. వాడ్ని లేదా పసిదాన్నీ ఇంటికొచ్చిన వాళ్ళు ఎత్తుకుని 'ఛీ ఛీ' అనగానే తిక్కరేగి వుచ్చ పోసేసి వాళ్ళ పాంటూ లేదా చీరా తడిపేసి, బోసి నవ్వులు నవ్వుతూ 'అయిందా పెళ్ళి? తీరిందా తిక్క' అనేట్లు చూసేవాళ్ళు పిల్లలు.

కొంతమంది పిల్లల్ని గిచ్చి, బుగ్గలమీద కొట్టి ముద్దులు పెట్టుకునే వాళ్ళుంటారు. మా బంధువుల్లో కూడా అలాంటి వాళ్ళు ఉండేవారు. అటువంటి వాళ్ళ చేతికి పసిపాపల్ని ఇవ్వడం తల్లులకి ఇష్టం ఉండదు. కానీ వాళ్ళు పైశాచికంగా లాక్కుని, బుగ్గలు నలిపి లేదా కర్కశంగా ముద్దులు పెడ్తారు. వారికి తల్లులు నిర్మొహమాటంగా బిడ్డల్ని 'ఇవ్వం' అనాలి. పసివాళ్ళని పరిరక్షించాల్సిన బాధ్యత అమ్మానాన్నలది. పాపం వారు మనమీద ఆధారపడ్డ అమాయక ప్రాణులు.

పిల్లలు ఇంకొంచెం పెద్దయ్యి, వీళ్ళు ఎడ పిల్లలయి, వెనక తమ్ముడో చెల్లెలో పుట్టాక, ఇంటికొచ్చిన అతిథుల్లో కామన్‌గా కనిపించే శాడిజం ఒకటుంటుంది. "మీ చెల్లెల్ని తీసుకెళ్ళిపోతాం... తమ్ముడ్ని నీకు ఇవ్వం" అంటూ. అలా మా పెద్దవాడితో, మా చిన్నవాడిని ఎత్తుకుని అంటుంటే, ఎంతలా ఏడ్చేవాడో పాపం. నిజంగానే తీసుకెళ్ళిపోతారులా వుంది అనుకుంటూ. అలాగే ఓ రోజు అమీర్ పేట సీతాదేవి గారింట్లో ఉండగా చప్పట్లు కొడ్తూ కొజ్జావాళ్ళు వచ్చి, బయట పడుకున్న చిన్నవాడ్ని ఎత్తుకుని 'ఐదువందలియ్యి లేదా తీసుకుపోతాం' అన్నారు. నేను వలవలా ఏడుపు. నన్ను చుట్టుకుపోయి "నా తమ్ముడు.. నా తమ్ముడు" అని మా పెద్దవాడూ ఏడుపు. ఇరుగు పొరుగులు ఆ శ్రీమంతులుండే లొకాలిటీలో తలుపైనా తీసి ఇవతలకి రాలేదు ఇంత జరుగుతున్నా. చివరికి నేను ఇంట్లో వున్నదంతా వూడ్చి వాళ్ళకిస్తే అప్పుడు పిల్లాడ్ని విడిచి, ఏదో ఆశీర్వాదాలు చదివి వెళ్ళారనుకోండి. కానీ అది పీడకలలా వెన్నాడి, మా పెద్దవాడు చిన్నవాడిని 'మీ తమ్ముడిని తీసుకుపోతాం' అని ఎవరైనా అంటే చేతిలో వున్నది విసిరేసేవాడు. నేనైతే కాస్త బలమైనవి వాడి చేతికిద్దాం అనుకునేదాన్ని. అంతలా కోపం వచ్చేది. అసలు పిల్లలని ఏడిపించి తృప్తిపడే ఆ గుణం దేనికి చెప్పండి?

ఇప్పుడు తల్లి కడుపుతో వుండగానే పిల్లలకి పెరాంబులేటర్లూ, ఉయ్యాలలూ, బోలెడు బొమ్మలూ, రకరకాల బొమ్మల పుస్తకాలూ అన్నీ కొనేస్తారు. అప్పట్లో వాళ్ళు తీర్థంలో కొనుక్కొచ్చిన చెక్కబొమ్మలూ, దొండకాయలూ, రబ్బర్ బొమ్మలూ, బూరలతో ఆడుకునేవారు అసలు పిల్లలకి మనం ఎన్ని బొమ్మలు కొన్నా, వంటింట్లో గరిటెలూ, అట్లకాడలూ, తాతయ్య చదివే భగవద్గీతా, బామ్మ కళ్ళజోడూ, అమ్మ మంగళసూత్రం, నాన్న మీసాలతో ఆడటం ఇష్టం. ఇవిలేని ఇల్లుండదు కదా! పాపలకి ఏ రంగులిష్టం? ఏ బొమ్మలిష్టం, ఏ కార్టూన్లు ఇష్టం? అని ఆలోచించే ఇప్పటి అమ్మా నాన్నలు తెలుసుకోవాల్సింది ఏవిటంటే పాపలకి పెద్దవాళ్ళంటే ఇష్టం. 'అసలుకన్నా వడ్డీ ముద్దు' అని వాళ్ళ మీదే ప్రాణాలు పెట్టుకుని వాళ్ళని చూడ్డంకోసం, వాళ్ళ మాటలు వినడం కోసం పరితపించిపోయే 'గ్రాండ్ పేరెంట్స్' మించిన ఇష్టమైన విషయం పాపలకి ఉండదు గాక ఉండదు.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4